క్లుప్తంగా

నేడు మల్లికార్జున స్వామి కల్యాణం

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని ఉప్పరిగూడలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మల్లిఖార్జున స్వామి, భ్రమరాంబ, కేతమ్మ దేవతల కల్యాణాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ దాత బూడిద నందారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:15 నిమిషాలకు జరిగే ఈ కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జోగు కృష్ణయ్యకు సన్మానం



కృష్ణయ్యను సన్మానిస్తున్న డీఈఓ

యాచారం: తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల తెలుగు భాషోపాధ్యాయులు జోగు కృష్ణయ్యకు ఘనంగా సన్మానించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కవి సమ్మేళనంలో భాగం యాచారం మండలానికి చెందిన జోగు కృష్ణయ్యకు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్ శాలువాతో సన్మానించి, రూ.1,116 నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. మరిన్ని అవార్డులు అందుకోవలన్నారు.

నేడు 2కే రన్

ఆమనగల్లు: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఉదయం 7 గంటలకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు సీఐ ఉపేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాల పరిధిలోని యువతీయువకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐ కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటిచూపు మందగించిన వారికి ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పాష కోరారు

నేడు పీఏసీఎస్ గోదాం నిర్మాణానికి భూమిపూజ

యాచారం: మండల కేంద్రంలో రూ.52 లక్షల నిధులతో యాచారం పీఏసీఎస్ గోదాం నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారని పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

యువతి వివాహానికి ఆర్థికసాయం



శృతికి వివాహ కానుక అందిస్తున్న విజయ, విశ్వనాథం దంపతులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన నిరుపేద యువతి శృతి వివాహానికి ఆమనగల్లు పట్టణానికి చెందిన దొంతు విజయ, విశ్వనాథం దంపతులు సాయం అందించారు. తల్లిదండ్రులు కోల్పోయిన కుమారి శృతి వివాహం సందర్భంగా ఆదివారం అరతులం బంగారం, నూతన దుస్తులు అందించి ఆశీర్వదించారు.

హరీశ్‌రావును కలిసిన కురుమసంఘం నేతలు



హరీశ్‌రావుకు గొంగడి కప్పి సన్మానిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: నిమ్స్ డైరెక్టర్‌గా డా.బీరప్పను నియమించినందుకు కృతజ్ఞతగా ఆదివారం ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును కురుమసంఘం వర్కింగ్ స్టేట్ ప్రెసిడెంట్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, ఎమ్మెల్సీ మల్లేష్ కలిసి గొంగడి కప్పి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కురుమల ఆత్మగౌరవ దొడ్డి కొమురయ్య భవన ప్రారంభోత్సవ తేదీ ఖరారు విషయంపై మంత్రితో చర్చించినట్లు వారు చెప్పారు.

కలగానే జూనియర్ కళాశాల ఏర్పాటు?

- తలకొండపల్లిలో ఇంటర్ కాలేజీ లేక ఇబ్బందులు
- నిరాహార దీక్షలు చేసినా దక్కని ఫలితం
- ఏటా టెన్త్ పూర్తిచేస్తున్న వెయ్యిమందికి పైగా విద్యార్థులు
- ముందుకుసాగని విద్యాభ్యాసం



తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

తలకొండపల్లి: ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించి పేద విద్యార్థులకు మేలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్న, అవి ఆచరణలో అమలుగాక కాగితాలకే పరిమితమవుతున్నాయని పలువురు విద్యావేత్తలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. పది చదివిన విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసించలేక మధ్యలోనే అర్ధాంతరంగా చదువును మానేస్తున్నారు.

ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు

మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని గతంలో పార్టీలకతీతంగా వివిధ పార్టీల నాయకులు అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేపట్టారు. అయినా ఫలితం లేదని పలు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

మండలంలోని ఉన్నత పాఠశాలలు..

మండల కేంద్రంతో పాటు, చంద్రధన, వెల్జాల్, గట్టుఇప్పలపల్లి, ఖానాపూర్, చుక్కాపూర్, రాంపూర్, పడకల్‌తో పాటు, కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలున్నాయి. ఇవికాక పరిసర ప్రాంత గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలలో సుమారుగా ప్రతి యేటా 1000 మంది విద్యార్థులు పదొవ తరగతి చదువుతున్నారు. వీరిలో సగానికి పైగా విద్యార్థులు ఇంటర్ విద్యను చదవలేక పోతున్నారు. ఆర్థికంగా ఉన్నవారు మాత్రమే పట్టణాల్లో కెళ్లి చదువుతున్నారు. ఫీజులు కట్టలేని పేద విద్యార్థులు మాత్రం ఇంటర్ విద్యకు దూరమవుతున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలోనైనా మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆందోళనలు చేపడుతాం



విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని గతంలో అనేక పర్యాయాలు అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు, చేపట్టాం. అయినా ప్రభుత్వ యంత్రాంగం ఏ మాత్రం స్పందించడంలేదు. బీజేవైఎం ఆధ్వర్యంలో మరోసారి నిరాహార దీక్షలు, ఆందోళనలు చేపట్టి కళాశాల ఏర్పాటుపై కృషి చేస్తాం. ఆందోళనలో అందరూ కలిసిరావాలి.

– అనిల్, ఉప సర్పంచ్, తలకొండపల్లి

ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం



జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మండల సర్వసభ్య సమావేశాల్లో తీర్మానించాం. పలు సందర్భాల్లో మంత్రి సబితారెడ్డికి వినతిపత్రాలు అందజేశాం. అయిన ప్రభుత్వంలో చలనం లేదు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు అయితే మండలంలోని 32 గ్రామాలతో పాటు, చుట్టూ పక్కల పరిసర గ్రామాల విద్యార్థులకు మేలు జరుగనుంది. ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి.

– నిర్మల, ఎంపీపీ, తలకొండపల్లి

కళాశాల ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో జూనియర్ కళాశాల లేక నిరుపేద విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమవుతున్నారు. పదితోనే చదువు మానేస్తున్నారు. పేద విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి.

– అశోక్‌గౌడ్, గట్టుఇప్పలపల్లి

అధికారుల కనుసన్నల్లోనే కబ్జాల పర్వం

మాసబ్ చెరువును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి



చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలను పరిశీలిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: మాసబ్ చెరువు కబ్జా అవుతున్నా పట్టించుకోకుండా అక్రమార్కులకు అండగా నిలుస్తున్న అధికారులను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జైలుకు పంపిస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులతో కలిసి చెరువు శిఖం సర్వే నంబర్ 137లో వేసిన రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగడానికి ఉపయోగపడే ఈ చెరువును ల్యాండ్ మాఫియా కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారుల కనుసన్నల్లోనే ఈ కబ్జాల పర్వం కొనసాగుతుందని ఆరోపించారు. అధికారులు, ప్రభుత్వం ఇకనైనా స్పందించి చెరువు ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షుడు రమేష్, కౌన్సిలర్లు మంగమ్మ, సునీల్, శ్రీలత, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు నర్సింహగౌడ్, నాయకులు అరుణ్‌కుమార్, వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బాటసింగారం జెడ్పీహెచ్‌ఎస్ 1985-86 బ్యాచ్ విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86వ విద్యాసంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం బాటసింగారంలోని పీవీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమావేశమయ్యారు. దాదాపు 37ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఓకేచోటు కలిసి తమ జ్ఞాపకాలను నెమరువేసుకోవడంతో పాటు కష్టసుఖాలను పంచుకున్నారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అందరూ ఓకే రకమైన దుస్తులను ధరించారు. విష్ణుగౌడ్, శివరాంరెడ్డి, జంగయ్యయాదవ్, ధన్‌రాజ్‌గౌడ్, జగదీశ్వర్, చంద్రశేఖర్, మహేందర్‌గౌడ్, క్రిష్ణ, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌గౌడ్, నరేందర్, క్రిష్టారెడ్డి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి



కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రజాసేవే లక్ష్యంగా ఐక్యతా ఫౌండేషన్ పనిచేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐక్యతా ఫౌండేషన్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యాలయాన్ని మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు మాడ్గుల మండల కేంద్రంలో ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు, కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రుల వద్ద నిరుపేదల కోసం ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించినట్లు ఆయన చెప్పారు. గ్రామాలు, తండాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు సుంకిరెడ్డి వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, సురేశ్, రామ్‌లాల్, జంగయ్య, బాలునాయక్, హరిలాల్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మోగనున్న బడిగంట

ప్రభుత్వ పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం అవుతున్నాయి. ఆదివారం(జూన్11)తో వేసవి సెలువులు ముగియడంతో విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. సెలవుల్లో ఆటపాటలతో హాయిగా గడిపిన విద్యార్థులు తిరిగి పలక-బలపం, పుస్తకాలతో కుస్తీ పట్టనున్నారు. ఈ యేడాది ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు చేపట్టిన బడిబాట కార్యక్రమాని మంచి స్పందన వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య పెరిగాయని విద్యాశాఖ తెలిపింది. ఆంగ్ల మాధ్యమం, మన ఊరు-మన బడి ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వం అందించే పథకాలు అడ్మిషన్ల సంఖ్యను పెంచడానికి కారణంగా చెప్పవచ్చు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పాఠశాలలో కట్టిన మామిడి తోరణం



ఇబ్రహీంపట్నం రూరల్: పేరెంట్స్ మీటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

చెన్నారం రోడ్డుపై బ్రిడ్జి నిర్మించండి

కేంద్రమంత్రి మహేంద్రనాద్ పాండేకు బీజేపీ నేతల వినతి



మహేంద్రనాద్ పాండేకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి నుంచి చెన్నారం వెళ్లే రోడ్డు గుండా ప్రవహించే వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖామంత్రి మహేంద్రనాద్ పాండేకు బీజేపీ సీనియర్ నాయకుడు రాంరెడ్డి, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎర్రవోలు శ్రీనివాసులు కోరారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో ఆదివారం కేంద్రమంత్రి మహేంద్రనాద్ పాండేను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, జంగయ్య, శ్రీనివాసులు, శ్రీశైలంయాదవ్, ఎడ్ల శ్రీశైలం, వెంకటేశ్, శ్రీకాంత్, మురళి తదితరులు ఉన్నారు.

మేడిగడ్డ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన..

తలకొండపల్లి: కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి మహేంద్రనాథ్ పాండేను బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ సన్మానించారు. ఆదివారం ఆమనగల్లు మండలం మేడిగడ్డ గ్రామంలో కేంద్రమంత్రి పర్యటించారు. గ్రామ సడక్ యోజనలో భాగంగా రూ.3 కోట్ల27 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. అట్టి పనులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్‌నేత ఆచారీ, మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, పార్లమెంట్ కోకన్వీనర్ కమలేష్, నియోజకవర్గ కోకన్వీనర్ నర్సింహ, శ్రీశైలం, లక్ష్మణ్, ప్రశాంత్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో 'ఐపీఎల్' పోటీలు ప్రారంభం

యాచారం: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్థాయి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆసక్తికలిగిన క్రీడాకారులు పోటీలో పాల్గొనాలని కోరారు. ప్రథమ బహుమతి రూ.22,222, రెండో బహుమతి కింద రూ. 11,111 అందజేస్తామని నిర్వాహకులు శ్రీశైలం తెలిపారు. పంచాయతీ వార్డు సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు చందు, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్

ఇబ్రహీంపట్నం: గ్రూప్-1 ప్రిలిమ్స్ ఎగ్జామ్ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 8,472 మంది అభ్యర్థులకుగాను 4,835 మంది పరీక్షకు హాజరయ్యారు. 3,637 మంది గైర్హాజరయ్యారు. గ్రూప్స్ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంతో అభ్యర్థుల్లో నిరాశ నిస్పృహ చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షకు హాజరైన అభ్యర్థుల శాతం తగ్గినట్లు సమాచారం. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన గ్రూప్ 1 ప్రిమిలినరీ పరీక్ష హయత్‌నగర్‌లో ప్రశాంతంగా జరిగింది. మొత్తం 8 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 3,744 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 2,227 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 1517 మంది గైరాజరైనట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

'వీడియో పెట్టు.. లక్ష పట్టు' కరపత్రాల పంపిణీ

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ సమస్యలు, రాజకీయ పరిస్థితుల పట్ల అవగాహన పెంచుకోవడానికి, వారివారి గ్రామాల్లోని, మండలాల్లోని , నియోజకవర్గంలోని సమస్యలపై, 'వీడియో పెట్టు... లక్ష పట్టు' అనే కార్యక్రమంపై విజన్ వందే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు పౌండేషన్ నిర్వాహకులు, ఎన్ఆర్ఐ వరుణ్ వందే తెలిపారు. ఆదివారం మండలంలోని గ్రామాల్లో పోటీలకు సంబంధించి కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరుణ్ వందే మాట్లాడుతూ.. పోటీలు మూడు విడుతలుగా ఉంటాయని, వాయిస్ ఆఫ్ విలేజ్, వాయిస్ ఆఫ్ మండల్, వాయిస్ ఆఫ్ కల్వకుర్తి విభాగాలలో పోటీ ఉంటుందని తెలిపారు. రాజకీయ పరిస్థితులు, ప్రజాసమస్యలు, జరగాల్సిన అభివృద్ధి, మీ మీ వృత్తుల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, ఆరోగ్యం, విద్యా తదితర అనేక సమస్యలపై పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు కడ్తాల్, మాడ్గుల్ మండలాల వారు నంబర్ 9652571689, ఆమనగల్లు తలకొండపల్లి మండలాల 9704211689, కల్వకుర్తి వెల్దండ మండలాల వారు 7382691854 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మరమ్మతులు చేయండి ప్లీజ్

- నక్కర్తమేడిపల్లిలో పాడైన నీటిశుద్ధి కేంద్రం
- ఫిల్టర్ నీటి కోసం అవస్థలు పడుతున్న ప్రజలు



తుప్పు పట్టిన నీటి శుద్ధి యంత్రాలు

యాచారం: నక్కర్తమేడిపల్లి గ్రామంలో నీటి శుద్ధి కేంద్రం మరమ్మతులకు నోచుకోవడం లేదు. శుద్ధి కేంద్రం చెడిపోయి ఐదేళ్లు అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. 15 ఏళ్ల కింద గ్రామంలో నీటి కాలుష్యంతో వాంతులు, విరేచనాలు సోకి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో గ్రామీణ నీటిపారుదల సంస్థ ఇబ్రహీంపట్నం ఫ్లోరైడ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రూ.10 లక్షల నిధులతో తాగు నీటి ఫిల్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటు వద్ద నక్కర్తమేడిపల్లి గ్రామస్తులే కాక సమీప గ్రామాలైన నానక్‌నగర్, మల్కీజ్‌గూడ, తక్కళ్లపల్లి, పల్లెచల్కతండా ప్రజలు వచ్చి శుద్ధి చేసిన నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకునే వారు. ప్రస్తుతం ఈ నీటి శుద్ధి కేంద్రం చెడిపోతున్నా పట్టించుకునే వారే లేరు. రూ.లక్షలాది విలువ జేసే యంత్రాలు తుప్పు పడుతున్నాయి. నీటిశుద్ధి కేంద్రానికి మరమ్మతులు చేసి స్వచ్ఛమైన నీటిని అందించాలని పలుమార్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందిచడంలేదంటూ విమర్శలు ఉన్నాయి.

నెలకు రూ.15 లక్షల ఖర్చు..

నీటి శుద్ధి కేంద్రం చేడిపోవడంతో నక్కర్తమేడిపల్లి గ్రామస్తులు నిత్యం రూ.20 వేలకు పైగా ఖర్చు చేసి ప్రైవేట్ వ్యాపారుల వద్ద ఫిల్టర్ నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు. మిషన్ భగీరథ నీళ్లు సరఫరా అవుతున్నా గ్రామస్తులు మాత్రం ప్రైవేట్ వ్యాపారులు తెచ్చే శుద్ధి చేసిన నీటినే కొనుగోలు చేస్తున్నారు. నిత్యం ప్రతి కుటుంబం రూ.15 ఖర్చు చేసి 20 లీటర్ల నీటి క్యాన్‌ను కొనుగోలు చేస్తోంది. నక్కర్తమేడిపల్లి గ్రామంలో దాదాపు 1500లకు పైగా ఇళ్లు ఉంటాయి. నెలకు మొతంతంగా రూ.15 లక్షలకు పైగానే శుద్ధి చేసిన నీటికి ఖర్చు చేస్తున్నారు. గ్రామంలో చెడిపోయిన నీటి శుద్ధి కేంద్రాన్ని మరమ్మతులు చేయిస్తే 20 లీటర్ల క్యాన్ నీటికి రూ.10 ధర చెల్లించుకున్నా గ్రామ పంచాయతీకి మంచి ఆదాయం వస్తుంది. ముఖ్యంగా పంచాయతీ పర్యవేక్షణలో నీటి శుద్ధి కేంద్రం ఉంటే తగిన మోతాదులో కెమికల్స్ వేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించే అవకాశం ఉంటుంది. పైగా సమీప గ్రామాల్లోని ప్రజలు కూడా నక్కర్తమేడిపల్లి గ్రామానికి వచ్చి నీటిని కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇదే విషయమై ఎంపీడీఓ విజయలక్ష్మిని వివరణ కోరగా త్వరలో నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించి మరమ్మతులకు కృషి చేస్తానని అన్నారు.

మరమ్మతులు చేయించాలి



గ్రామంలోని నీటి శుద్ధి కేంద్రం చెడిపోవడంతో నిత్యం రూ.20 ఖర్చు చేసి ప్రైవేట్ వ్యాపారుల వద్ద నీటిని కొనుగోలు చేస్తున్నాం. ఒక్కోరోజు ప్రైవేట్ వ్యాపారులునీటిని తీసుకురారు. గ్రామంలోని నీటి శుద్ధి కేంద్రానికి మరమ్మతులు చేయించాలి.

– రవీందర్‌గుప్త, నక్కర్తమేడిపల్లి

ఘనంగా కోటమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

తలకొండపల్లి: మండలంలోని చంద్రధనలో బొడ్రాయి, కోట మైసమ్మ దేవతా విగ్రహాల ప్రతిష్టాపన మొదటి వార్షికోత్సవ సంబురాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ బొడ్రాయి, శివనామ సంకీర్తనలు ఆలపించారు. వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య బొడ్రాయిని అభిషేకించారు. మహిళలు శుద్ధజలంతో కూడిన బిందెలతో, భక్తిశ్రద్ధలతో బొడ్రాయికి అభిషేకం జరిపి, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పంచామృతములతో యజ్ఞ హోమాలు జరిపారు. సోమవారం సాయంత్రం బొడ్రాయి, కోట మైసమ్మ బోనాలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బక్కి కుమార్ తెలిపారు. సర్పంచ్ కుమార్, వార్డు సభ్యులు రాణి, రాజు, రేణుక, యాదయ్య, కృష్ణవేణి, యాదగిరిగౌడ్, దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసు, రాములు, మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్, నాయకులు చిత్తరంజన్‌దాసు, రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.